teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక


ములుగు | సంపుటి : 04 | సంచిక : 97 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 14 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## నాగార్జునసాగర్ 26 గేట్లు ఎత్తి భారీగా నీటి విడుదల



04




ఫార్ములా ఈ-రేసు కేసులో తుది

# నివేదిక సిద్ధం

### విజిలెన్స్ కమిషన్‌కు ఏసీబీ నివేదిక సమర్పణ

### క్విడ్ ప్రోకో జరిగినట్లు ఆధారాలు సేకరించిన అధికారులు

**బీఆర్ఎస్ పార్టీకి రూ.44 కోట్ల ఎలక్టోరల్ బాండ్స్ లభించినట్లు సమాచారం**



ఫార్ములా ఈ-రేసు కోసం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టిన ఏసీబీ నివేదికను సిద్ధం చేసింది. ఈ మేరకు ఆ రిపోర్టును తాజాగా విజిలెన్స్ కమిషన్ వద్దకు చేరింది. అయితే, మరో రెండు రోజుల్లో ఫైల్‌పై తుది నిర్ణయం తీసుకుని విజిలెన్స్ కమిషన్ సర్కార్‌కు ఫార్ములా ఈ-రేసు కేసు తుది నివేదికను అందజేయనుంది.



02

## తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరిక



**ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 19 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**అల్పపీడనం ప్రభావంతో వర్షాలు, ఈదురుగాలులకు అవకాశం**

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పలు ప్రాంతాల్లో మరోసారి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. శనివారం ఐదు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా

మిగతా 2 లో



## రైతులను పోలీస్ స్టేషన్లలో పెట్టి ఎరువుల పంపిణీ..?

- కామారెడ్డిలో పోలీస్ స్టేషన్లోనే యూరియా టోకెన్లు
- ఈ పరిస్థితి తెచ్చిన నువ్వు చరిత్ర హీనుడిగా మిగిలిపోతావ్
- రైతులను నేరస్తులుగా మార్చారని సీఎంపై విమర్శలు
- రైతులను స్టేషన్‌కు తరలించడంపై హరీశ్ రావు ఆగ్రహం



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): కామారెడ్డి జిల్లాలో యూరియా కోసం రైతులను పోలీసు స్టేషన్‌కు తరలించిన ఘటనపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్ వేదికగా వీడియోలను


మిగతా 2 లో



## చైనాపై భారీ సుంకాలు విధించండి

- నాటో దేశాలకు ట్రంప్ పిలుపు
- ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు అవసరమని ట్రంప్ వెల్లడి
- రష్యాను ఆర్థికంగా బలహీనపరచడమే లక్ష్యం
- రష్యా నుండి చమురు కొనుగోలు నిలిపివేయాలి

.. వివరాలు 2లో




## ఓటర్ల జాబితా మా హక్కు

- కోర్టు జోక్యం తగదు: ఎన్నికల సంఘం
- సుప్రీంకోర్టుకు ఈసీ అఫిడవిట్ దాఖలు
- ఓటర్ల జాబితా సవరణ తమ అధికార పరిధిలోదేనని స్పష్టం
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 324ను ప్రస్తావించిన ఈసీ
- న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్‌పై ఈసీ అఫిడవిట్

.. వివరాలు 2లో

## విత్తన రంగంలో తెలంగాణకు అరుదైన అవార్డు

- ఇండియా - ఆఫ్రికా సీడ్ సమ్మిట్‌లో లభించిన గౌరవం
- విత్తన ఎగుమతుల్లో తెలంగాణ ఆదర్శంగా నిలిచింది
- ఆఫ్రికా ప్రతినిధుల ప్రశంస.. ఆన్‌లైన్ ధ్రువీకరణ, ట్రేసబిలిటీలో దేశంలోనే మొదటిసారి
- విత్తనోత్పత్తిలో తెలంగాణ దేశానికే దిక్సూచి
- డైరెక్టర్ డాక్టర్ కేశవులు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 13(తీన్మార్ న్యూస్): విత్తన ఎగుమతులకు కావలిసిన అధునాతన సౌకర్యాలను తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ విత్తన పరీక్ష ల్యాబ్‌లో ఏర్పాటు చేసుకోవటం గొప్ప




మిగతా 2 లో



## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్
- సమస్యలపై స్పందించిన బండి సంజయ్
- ఇది ప్రభుత్వ వైఫల్యమే
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాటపట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థుల సమస్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ రియాక్ట్ అయ్యారు. ఈ మేరకు ఆయన సోషల్

మిగతా 2 లో



## అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం

02

- రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
- అనీష్ కన్స్ట్రక్షన్ అక్రమ నిర్మాణాలను తొలగింపు
- అట్టి భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరంగా బీఆర్ఎస్

- కాళేశ్వరం కేసులో విచారణ నుంచి తప్పించుకోవడానికే
- మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణ
- కేటీఆర్ స్థాయి, గాంధీ కుటుంబం త్యాగాలు ఏంటని ప్రశ్న
- బీఆర్ఎస్‌ను విమర్శిస్తూ బీజేపీపై పీసీసీ చీఫ్ ఆరోపణలు



02



## మిలాద్ ఉన్ నబీ ఊరేగింపుకు ట్రాఫిక్ ఆంక్షలు

- నేడు పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- ఊరేగింపు కారణంగా నేడు చార్మినార్ బంద్
- వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలి
- ట్రాఫిక్ పోలీసులు సూచన

02

## ఫోర్త్ సిటీ నుంచి కొత్త ఎక్స్‌ప్రెస్ హైవే

- రవాణా ఆధారిత అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత
- హైవేకు సమాంతరంగా రైల్వే లైన్ ఏర్పాటు యోచన
- రూ.10 వేల కోట్ల అంచనా వ్యయంతో 12 వరుసల హైవే
- ఫోర్త్ సిటీకి నలుదిక్కులా రవాణా సౌకర్యాలు



02



## కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

- గ్రూప్-1 పరీక్షపై అసత్య ఆరోపణల పేర కంప్లైంట్
- క్షమాపణలు చెప్పకుంటే రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరిక

.. వివరాలు 2లో

# ఫార్ములా ఈ-రేసు కేసులో తుది నివేదిక సిద్ధం




హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఫార్ములా ఈ-రేసు కోసం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టిన ఏసీబీ నివేదికను సిద్ధం చేసింది. ఈ మేరకు ఆ రిపోర్టును తాజాగా విజిలెన్స్ కమిషన్ వద్దకు చేరింది. అయితే, మరో రెండు రోజుల్లో ఫైల్‌పై తుది నిర్ణయం తీసుకుని విజిలెన్స్ కమిషన్ సర్కార్‌కు ఫార్ములా ఈ-రేసు కేసు తుది నివేదికను అందజేయనుంది. అక్కడి ఆమోదం వచ్చిన వెంటనే నిందితులపై చార్జీషీటు దాఖలుకు చేసేందుకు తిరిగి నివేదిక ఏసీబీకి చేరనుంది. కాగా, ఫార్ములా ఈ-రేసు కేసులో A1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, A2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, A3గా హెచ్ఎండీఏ మాజీ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలతో పాటు మరో ఇద్దరు A4, A5 నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్‌ను మూడు సార్లు ఏసీబీ ప్రశ్నించింది. అయితే, ఫార్ములా ఈ-కారు రేస్‌లో భారీగా అవినీతి జరిగినట్లుగా ఏసీబీ తేల్చింది.

కేసులో క్విడ్ ప్రోకోను అధికారులు స్పష్టమైన సాక్ష్యాధారాలతో నిరూపించినట్లుగా సమాచారం. ఫార్ములా ఈ-రేసు కోసం స్పాన్సర్‌షిప్ చేసిన సంస్థ నుంచి రేసు నిర్వహించిన సంస్థకు రూ.44 కోట్లు చెల్లింపులు జరిగినట్లుగా గుర్తించారు. అందుకు బదులుగా సదరు స్పాన్సర్‌షిప్ సంస్థ నుంచి రూ.44 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్‌ను బీఆర్ఎస్ తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

# తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరిక



మొదటి పేజీ తరువాయి

మరో 19 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ 19 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఇక, అంతకుముందు ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. ఆదివారం మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది. వర్షాల ప్రభావంతో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే వీలుందని తెలిపింది.


# రైతులను పోలీస్ స్టేషన్లలో పెట్టి ఎరువుల పంపిణీ..?



మొదటి పేజీ తరువాయి

పోస్ట్ చేశారు. భూమి కోసం పోరాడిన లగ చర్ల దళిత, గిరిజన, బలహీనవర్గాల రైతుల పై అక్రమ కేసులు బనాయించి సంకెళ్లు వేశారని ఆరోపించారు. నేడు బస్తా యూరియా కోసం పోలాలు వదిలి పోలీస్ స్టేషన్లకు వెళ్లి పడిగాపులు కాసే దుస్థితిని రైతన్నకు తెచ్చారని మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతులు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి నేరస్తులా? అని ప్రశ్నించారు. నీ చేతగాని పాలనతో రైతులను అరిగోస పెడుతున్నావని సీఎంను నిలదీశారు. అన్నదాతలను నడిరోడ్డుకు ఈడ్చి వికృతానందం పొందుతున్నావు. రైతులను పోలీస్ స్టేషన్లలో పెట్టి ఎరువులు పంపిణీ చేసే పరిస్థితులు తెచ్చిన నువ్వు చరిత్ర హీనుడిగా మిగిలిపోక తప్పదని విమర్శించారు. రైతులను నేరస్తులుగా పోలీసు స్టేషన్లలో కూర్చోబెట్టిన నీ దుర్మార్గ వైఖరిని యావత్ తెలంగాణ సమాజం గమనిస్తోందని, తగిన సమయంలో బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. కాగా, తాజాగా కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంలో రైతులను కట్టడి చేయలేక, పోలీస్ స్టేషన్‌లో యూరియా టోకెన్లు సొసైటీ సిబ్బంది పంపిణీ చేసింది. కొందరికి మాత్రమే యూరియా టోకెన్లు సిబ్బంది పంపిణీ చేశారు. దీంతో పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన వాతావరణం నెలకొంది.

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరంగా బీఆర్ఎస్



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం విషయంలో సీబీఐ విచారణ తప్పించుకోవడానికే మోడీ కాళ్లకు మడుగులు ఒత్తుతూ బీఆర్ఎస్ ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో కేటీఆర్ తన స్థాయి మరిచి రాహుల్ గాంధీపై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్ మీ స్థాయి ఏంది? మీ కుటుంబ స్థాయి ఏంది అని ప్రశ్నించారు. రాష్ట్ర సంపదనంతా కొల్లగొట్టిన మీ కుటుంబం ఎక్కడా? దేశం కోసం సర్వ సంపదను త్యాగం చేసిన గాంధీ కుటుంబం ఎక్కడా అని నిలదీశారు. శనివారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో సుదర్శన్ రెడ్డికి బీఆర్ఎస్ ఎందుకు ఓటు వేయలేదని ప్రశ్నించారు. నిఖార్సైన తెలంగాణవాది జస్టిస్ సుదర్శన్ రెడ్డి బరిలో ఉంటే సిగ్గులేకుండా ఎన్నికకే దూరం ఉన్నారంటే బీజేపీతో లోపాయికారి ఒప్పదం ఏ మేరకు ఉందో అర్థమవుతోందన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఇప్పటికే కవిత చెప్పారని ముందు కవిత మాటలపై కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. మోడీతో కాళ్ల బేరం కుదుర్చుకున్న కేటీఆర్ ఆయన దృష్టిలో పడేందుకే రాహుల్ గాంధీని విమర్శిస్తూ తపన ప్రజలకు అర్థం అవుతోందన్నారు. బీఆర్ఎస్ బీజేపీతో మానసికంగా విలీనం అయ్యారు కాబట్టే రాహుల్ పై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పాల్సిన బాధ్యత మీది నాది కాదని ఇది స్పీకర్ కు, ఎమ్మెల్యేలకు మధ్య జరుగుతున్న వ్యవహారం అన్నారు. ఏ పార్టీలో ఉన్నారో ఎమ్మెల్యేలు స్పీకర్ కు వివరణ ఇస్తారన్నారు. ఎమ్మెల్యేల విషయంలో మాట్లాడే అర్హత కేటీఆర్ కు లేదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు చేసిన మీ చరిత్ర అందరికీ తెలుసన్నారు. ఓటు చోరీ అంశాన్ని రుజువులతో సహా రాహుల్ గాంధీ నిరూపిస్తుంటే వీటిని జీర్ణించుకోలేని మోడీ కేటీఆర్ తో ఇలాంటి మాట్లాడిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు వేరు కాదని రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో తేల్చేస్తామని కిషన్ రెడ్డి గతంలో అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించి రోజులు గడుస్తున్నా కిషన్ రెడ్డి ఎక్కడ పడుకున్నారని నిలదీశారు. కాళేశ్వరంపై సీబీఐ కేసులో ఎందుకు కదలిక లేదని ప్రశ్నించారు. సీబీఐ కేసు నుంచి తప్పించుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఢిల్లీలో మోడీ, అమిత్ షా, నడ్డా చుట్టూ తిరిగింది నిజమా కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికీ వారిని కలిసే ప్రయత్నం చేస్తున్నారా లేదా అని నిలదీశారు.

# విత్తన రంగంలో తెలంగాణకు అరుదైన అవార్డు

మొదటి పేజీ తరువాయి

విషయమని ఆఫ్రికా ప్రతినిధి యాకబో దయా పేర్కొన్నారు. ఆఫ్రికా దేశాలలో కూడా ఇలాంటి విత్తన పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులు అధునాతన విత్తన పరీక్ష పరికరాలు, యంత్రాలు, విత్తన పరీక్ష పద్ధతుల గురించి వారికి వివరించారు. శనివారం ఇండియా - ఆఫ్రికా సీడ్ సమ్మిట్‌లో ముగిసిన తరువాత ఆఫ్రికా ప్రతినిధుల బృందం అంతర్జాతీయ విత్తన పరీక్ష కేంద్రం సందర్శించారు. ఈ సమ్మిట్‌లో తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ విత్తన పరీక్ష-ధ్రువీకరణ ఎక్సలెన్సీ అవార్డును గెలుచుకుంది. భారత ఆహార వ్యవసాయ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా విత్తన రంగంలో విశేష సేవలందించిన సంస్థలకు ఈ అవార్డును అందజేశారు. అందులో భాగంగా తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కేశవులు అవార్డు అందుకున్నారు.




**విత్తన రంగంలోనే తెలంగాణ ఆదర్శం: డైరెక్టర్ కేశవులు**

తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ దేశంలోనే మొదటిసారిగా ఆన్‌లైన్ విత్తన ధ్రువీకరణ, సీడ్ ట్రేసబిలిటీ విధానాలను ప్రవేశపెట్టి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కేశవులు. అంతర్జాతీయ విత్తన పరీక్ష సంస్థ గుర్తింపు పొందిన తెలంగాణ ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తన ఎగుమతులకు మార్గం సుగమం చేసిందని వివరించారు. రైతులు, ఉత్పత్తిదారులకు శిక్షణ ఇస్తూ రాష్ట్ర విత్తన రంగానికి గణనీయమైన సహకారం అందిస్తోందని తెలిపారు. సంవత్సరానికి సుమారు 22 లక్షల క్వింటాళ్ల విత్తనాలను ఉత్పత్తి చేస్తూ తెలంగాణతో పాటు మరో పది రాష్ట్రాలకు ధ్రువీకరించిన విత్తనాలను సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణలో విత్తనోత్పత్తికి అనుకూల వాతావరణం ఉండటంతో 500కు పైగా విత్తన కంపెనీలు, 3.5 లక్షల మంది రైతులు ఉత్పత్తి చేస్తున్నారని, వారి నుండి దాదాపు 90 లక్షల క్వింటాళ్ల విత్తనాలు ఉత్పత్తి అవుతుండగా 3 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని తెలిపారు.

# మిలాద్ ఉన్ నబీ "ఊరేగింపుకు" ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ సిటీ ప్రజలకు ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు చేశారు. మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు సందర్భంగా నేడు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. మిలాద్-ఉన్-నబీ ఊరేగింపుల దృష్ట్యా ఫలక్‌నుమా, ఇంజన్ బౌలి, నాగుల్చింత ఎక్స్ రోడ్, హిమ్మత్‌పురా జంక్షన్, వోల్గా, హరిబౌలి, పంచ్ మొహల్లా, చార్మినార్, గుల్జార్ హౌజ్ , మదీనా జంక్షన్, పట్టర్‌ఘట్టి, ఎస్‌జె. హవేలీ, మిరల్ మండి, ఎతేబార్ చౌక్, అలీజా కోట్లా, బీబీ బజార్, వోల్టా హొటల్, అఫ్జల్‌గంజ్ T జంక్షన్, ఉస్మాన్ గంజ్, MJ మార్కెట్ జంక్షన్, తాజ్ ఐలాండ్, నాంపల్లి T జంక్షన్, హజ్ హౌస్, AR పెట్రోల్ పంప్, నాంపల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు ఉంటాయని చెప్పారు హైదరాబాద్ పోలీసులు. వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని అభ్యర్థించారు.

**నేడు చార్మినార్ బంద్:** మిలాద్-ఉన్-నబీ ఊరేగింపు కారణంగా సెప్టెంబర్ 14 ఆదివారం ఓల్డ్ సిటీలోని పర్యాటక ప్రదేశాలు మూసివేయనున్నట్లు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారి ఒకరు వెల్లడించారు. చార్మినార్‌తో పాటు ఓల్డ్ సిటీలోని స్మారక చిహ్నాలు, పలు పర్యాటక ప్రదేశాలు క్లోజ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. 2025, సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లో జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా కూడా చార్మినార్ ను మూసివేసిన విషయం తెలిసిందే.

# చైనాపై భారీ సుంకాలు విధించండి




న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): చైనాపై 50 నుంచి100 శాతం సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాటో దేశాలకు పిలుపునిచ్చారు. ఇది ఉక్రెయిన్‌లో యుద్ధం ముగింపు పలికేందుకు దారితీస్తుందని తెలిపారు. రష్యాను ఆర్థికంగా బలహీన పర్చేందుకు ఇది ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రంప్ నాటో దేశాలకు శనివారం ఓ లేఖ రాశారు. నాటో కంట్రీస్ అన్నీ రష్యా చమురు కొనుగోలును నిలిపివేయాలని, రష్యాపై కఠిన ఆంక్షలు విధించాలని సూచించారు. దీనిని నాటో దేశాలు అంగీకరించి చర్యలు ప్రారంభిస్తే రష్యాపై పెద్ద ఎత్తున ఆంక్షలు విధించడానికి తాను కూడా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. నాటో మిత్ర దేశాలన్నీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం మానేయాలి. చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలను విధించాలి. వార్ ముగిసిన తర్వాత మాత్రమే ఈ టారిఫ్ ఉపసంహరించుకోవాలి. దీంతో మాస్కోపై బీజింగ్ ప్రభావం తగ్గుతుంది. రష్యా ఆర్థికంగా బలహీనపడుతుంది అని లేఖలో పేర్కొన్నారు. తాను చెప్పినట్టు చేస్తే యుద్ధం త్వరగా ముగుస్తుందని తెలిపారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడానికి ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఇరు దేశాల అధ్యక్షుడు పుతిన్, జెలెన్ స్కీతో భేటీ అయ్యారు. అయితే కాల్పుల విరమణ సహా శాంతి ఒప్పందం ఖరారు కాలేదు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు నిలిచిపోయినట్టు రష్యా ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ నాటో దేశాలకు లేఖ రాయడం గమనార్హం. అంతకుము ముందు ట్రంప్ యుద్ధం ముగిసే దిశగా ఎటువంటి పురోగతి లేకపోతే మాస్కోపై ఆంక్షలు విధిస్తానని హెచ్చరించారు.

# ఓటర్ల జాబితా మా హక్కు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): దేశ వ్యాప్తంగా క్రమం తప్పకుండా ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం ఎన్నికల సంఘం అధికార పరిధిని ఉల్లంఘించడమే అవుతుందని ఈసీ తెలిపింది. ఎస్ఐఆర్ చేపట్టడం తమ హక్కు అని పేర్కొంది. కోర్టు దీని కోసం ఆర్డర్స్ ఇస్తే అది తమ హక్కులో జోక్యం చేసుకోవడమేనని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో శనివారం అఫిడవిట్ దాఖలు చేసింది. ఓటర్ల జాబితాను తయారు చేయడం, దానిని సవరించే పూర్తి అధికారం ఈసీకి మాత్రమే ఉందని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 లో ఈ విషయం స్పష్టంగా పేర్కొందని తెలిపింది. పార్లమెంటుకు, ప్రతి రాష్ట్ర శాసనసభకు జరిగే అన్ని ఎన్నికలకు ఓటర్ల జాబితా తయారీ, నిర్వహణ, పర్యవేక్షించే హక్కు ఈసీకి మాత్రమే ఉందని తెలిపింది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 21, 1960లోని రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టోరల్ రూల్స్ 25 ప్రకారం ఎస్ఐఆర్ నిర్వహించడానికి ఎన్నికల కమిషన్‌కు హక్కు ఉంది. ఈ ప్రక్రియ ఎలా నిర్వహించాలి, ఎంత కాలపరిమితిలోపు అనేది పూర్తిగా ఈసీదే నిర్ణయం. ఇందులో ఎటువంటి కోర్టు జోక్యం అవసరం లేదు అని తేల్చి చెప్పింది. న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఎన్నికల సంఘం ఈ అఫిడవిట్ దాఖలు చేసింది.

# కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఓయూ పోలీస్ స్టేషన్ లో కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. గ్రూప్-1 పరీక్షపై ప్రభుత్వ ప్రతిష్టకు భంగంగలించే అసత్య ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ పై టీపీసీసీ జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రూప్ -1 విషయంలో వస్తున్న ఆరోపణలను ఖండించిన దయాకర్ బీఆర్ఎస్ అధికారిక ఎక్స్ ఖాతా లో రూ. 3 కోట్లు కొట్టు గ్రూప్-1 పోస్టు పట్టు అని పోస్టు చేశారని ఈ విషయంలో కేటీఆర్ పై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

గ్రూప్-1 విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను ఖండించిన దయాకర్. 24 గంటల్లోకేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రూ. 100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు.

# వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ ఆన్లైన్ క్విజ్ లో రిజిస్టర్ అవ్వండి

## ప్రధాని మోదీని కలిసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

## చింతల అన్వేష్ మై భారత్ డిప్యూటీ డైరెక్టర్, ఉమ్మడి వరంగల్

మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): యువజన సర్వీసులు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి మేర యువభారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమం ద్వారా దేశం లోని యువతకు దేశ అత్యున్నత నాయకత్వానికి దేశాభివృద్ధి, అభివృద్ధి చెందిన దేశాన్ని సాధించడం కోసం తమ విలువైన ఆలోచనలు, సూచనలు ఇచ్చే అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లాల యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

**ఈ క్రింది లింకులో ఉన్న:**

https://mybharat.gov.in 09 Vikasit Bharat Young Leaders Dialogue (VBYLD) 2026 లో భాగంగా ఆన్లైన్ క్విజ్ ప్రోగ్రామ్ ద్వారా - 10 వేల మంది యువతను క్విజ్ ప్రోగ్రామ్ ద్వారా ఎంపిక చేసి వారికి వివిధ స్థాయిల్లో బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. అత్యున్నత ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా, రాష్ట్ర, దేశీయ స్థాయిలో ప్రభుత్వ ఖర్చులతో ఢిల్లీకి తీసుకెల్లడం జరుగుతుందని, చివరి అంకంలో దేశాభివృద్ధి, అభివృద్ధి చెందిన భారత్ కోసం దేశం అనుసరించాల్సిన వ్యూహం పై గౌరవ ప్రధానితో చర్చించే అవకాశం ఉంటుందని తెలిపారు. క్విజ్ పోటీలో పాల్గొనడం కోసం ఇంగ్లీష్ తో పాటు 12 భారతీయ భాషల్లో ఏదైనా ఒక భాష ఎంచుకొనవచ్చు.

ఇందుకు అర్హతలు:

1. మై భారత్ వెబ్సైట్ లింకు ద్వారా ఆన్లైన్ క్విజ్ లో పాల్గొనడం.
2. సెప్టెంబర్ 1,2025 నాటికి 15-29 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు అర్హులు.
3. ఆన్లైన్ ద్వారా మైభారత్ వెబ్సైట్ లో రిజిస్టర్ అవ్వడం ప్రధానం.

క్విజ్ పోటీల్లో అడగబోయే ప్రశ్నల కోసం:

1. జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలతో పాటు మన్ కీ బాత్ లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు ప్రస్తావించిన అనేక అంశాలు.
2. 2014 నుండి దేశం సాధించిన విజయాలు, ఘనతల పట్ల అవగాహన కలిగివుండటం.
3. ఒబెసిటీ పై అవగాహన
4. మారకద్రవ్యాల నిర్మూల.
5. ఆత్మ నిర్భర భారత్
6. వోకల్ ఫర్ లోకల్ అంశం.

పై సునిశిత అవగాహన కలిగి ఉంటే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించే సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మై భారత్, మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్, వరంగల్ చింతల అన్వేష్ పిలుపునిచ్చారు.

# ఘనంగా సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల తల్లిదండ్రుల సమావేశం

## జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి మాడిశెట్టి నరసింహస్వామి



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఈ రోజు సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ మహబూబాబాద్ జిల్లా పరిధిలో గల మొత్తం (24) వసతి గృహాలలో పేరెంట్స్ కమిటీ (తల్లిదండ్రుల సమావేశము) ఏర్పాటు చేయడము జరిగినది. అన్ని వసతి గృహాలలో తల్లిదండ్రులు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని వారి విలువైన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది. అట్టి సూచనలు సలహాలు తూచా తప్పకుండా పాటించి భవిష్యత్తులో అన్ని వసతి గృహాలు సజావుగా నడపడానికి ఎంతో తోడ్పడు తున్నవి ఇట్టి వసతి గృహాలలో వసతి గృహ అధికారులు సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది పాల్గొని విజయవంతము చేయనైనది, ఇట్టి పేరెంట్స్ కమిటీ సమావేశాలు జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి ఎం.నరసింహస్వామి, ఎస్సీ బాయ్స్ హాస్టల్ బలపాల, బాలికల హాస్టల్ కురవి, మరిపెడ లలో స్వయంగా పాల్గొని విజయవంతముగా చేశారు.

# యూరియా బస్తాలు అందక రైతు ఆత్మహత్యాయత్నం



కొత్తగూడ, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): మహబుబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో యూరియా పంపిణీ కేంద్రం వద్ద యూరియా అందక పంట నష్ట పోతుందని మల్యాల నరసయ్య అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నంచేశాడు. గత వారం రోజులుగా రాత్రి అనక పగలు అనక యూరియా కేంద్రం వద్ద పడికాపులు కాసిన ఒక్క యూరియా బస్తా కూడా అధికారులు ఇవ్వలేదని, కళ్ళముందు పంట నష్టపోతుంటే, చూడలేక మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశానని బాధితుడు అన్నాడు. నరసయ్య ఆరోగ్యపరిస్థితి విషమించడంతో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# జిల్లాలో పకడ్బందీగా యూరియా పంపిణీ

## మండల స్థాయిలో కోఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): శనివారం మహబూబాబాద్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు,వ్యవసాయ శాఖ అధికారులతో యూరియా సరఫరా పై జిల్లా యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయుటకు ఇప్పటికే వేసుకున్న ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్క ఉద్యోగి రైతు వేదికలు, ప్రాథమిక సహకార సొసైటీలు, తదితర కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో కచ్చితంగా ఉండాలని, రైతులకు వస్తున్న స్టాక్ వివరాలను తెలియపరచి వారిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చే విధంగా ముందస్తు సమాచారం ఇవ్వాలని, ఇప్పటివరకు యూరియా అందని రైతుల వివరాలను సేకరించి వారికి యూరియాలు సరఫరా చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల సౌకర్యార్థం త్రాగునీరు, టెంట్స్, చైర్స్, సదుపాయాలు కల్పించాలని, క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, యూరియా పంపిణీ విధులలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సోషల్ మీడియా, వివిధ సామాజిక మాధ్యమాలలో యూరియా రాదేమో అని, కొన్నిచోట్ల అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, అలాంటి అసత్య ప్రచారాలను మండల స్థాయి లలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే (18) మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, సహకార, సంఘాల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందనీ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులకు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. మండల స్థాయి యూరియా పంపిణీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాలు నిర్వహించి పక్కాగా యూరియా పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న కొనుగోలు కేంద్రాలతో పాటు అదనపు కొనుగోలు కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రద్దీ ఎక్కువగా ఉన్నచోట అదనపు క్యూ లైన్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, పోలీస్ సిబ్బంది ద్వారా రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని, జిల్లాకు రావాల్సిన యూరియా కోట తోపాటు అదనపు యూరియా కోసం రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారుల ద్వారా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. యూరియా సరఫరా అయ్యే వాహ నాల యొక్క వివరాలను పక్కాగా సమాచారం తెలుసుకొని నిత్యం గమ నిస్తూ ఉండాలని అన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికా రులు నిత్యం కేంద్రాలను తనిఖీ చేస్తూ నివేదికలను సమ ర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ, సహకార, అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో కలిసి ఎలాంటి పొర పాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం యూరి యా పంపిణీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. తొర్రూరు, మహబూ బాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు, గణేష్, కృష్ణవేణి,వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు అజ్మీరా శ్రీనివాసరావు, విజయ్ చంద్ర, శ్రీనివాస్,తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమా

## విద్యార్థులతో పనిచేయించడం ఏంటీ

## ప్రాణాలు పోతే బాధ్యులేవరు

## బిఆర్ఎస్ విద్యార్థి జిల్లా నాయకులు కొల్లోజు దిలీప్ కుమార్



భూపాలపల్లి, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మరియు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గొల్ల బుద్ధారం ఎస్టి పాఠశాలలో ఈరోజు రాజన్న అనే విద్యార్థితో చెట్లు కొట్టించగా కరెంట్ షాక్ తగిలింది కింద పడడం జరిగింది. హాస్టల్ వార్డు హఠాత్తుగా విద్యార్థిని భూపాలపల్లిలోని స్థానిక వంద పడకల ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఈ విషయం తెలుసుకొని బి ఆర్ ఎస్ వి జిల్లా విద్యార్థి విభాగం నాయకులు కొల్లోజు దిలీప్ కుమార్ మాట్లాడుతూ మొన్న అర్బన్ స్కూల్ ఘటన నిన్న రాత్రి జరిగినటువంటి గంగారం స్కూల్ ఘటన ఈరోజు జరిగినటువంటి గొల్ల బుద్ధారం ఎస్టీ హాస్టల్ లో విద్యార్థులతో పని చేయించి విద్యార్థుల యొక్క ప్రాణాలతో చెలగాటమాడుతున్నటువంటి ఈ యొక్క స్కూల్ యాజమాన్యమైన వార్డెన్ పై కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే ఇప్పటివరకు ఈ సంఘటనపై డీఈవో కి ఫోన్ చేసి మాట్లాడిన స్పందన కరువైందని ఇలాంటి నిర్లక్ష్యమైన వైఖరితో ప్రభుత్వం అలాగే సంబంధిత అధికారులు వ్యవహరించే ఈ మొండి వైఖరిని మారాలని ఘటనకు బాధ్యుడు అయినటువంటి హాస్టల్ వార్డెన్ ని తక్షణమే సస్పెండ్ చేయాలని బి ఆర్ ఎస్ వి విద్యార్థి విభాగం తరఫున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి ఆర్ఎస్వి జిల్లా నాయకులు ఆకుదారి మనోహర్ భూక్య మహేశ్వర్, భూక్య హరీష్, ప్రశాంతి యాదవ్, కొమ్ము దేవేందర్ యాదవ్, ప్రేమ్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# కేటీకే-6 ఇంక్లైన్ గనిలో ప్రమాదం

## టాప్ కూలడంతో కార్మికుడు మొండయ్యకు తీవ్ర గాయాలు





భూపాలపల్లి, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-6 ఇంక్లైన్ లో గని ప్రమాదం చోటు చేసుకుంది. టాప్ కూలడంతో సింగరేణి కార్మికుడు రాదండి మొండయ్య (57) తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి బాధ్యత మేనేజ్మెంట్ వహించాలని కార్మిక నాయకులు కోరారు. వన్ సిమ్ ఎస్ఎస్-6 సైడ్ బాటమ్ పనులు జరుగుతున్న సమయంలో అక్కడ రూఫ్ బాగోలేదని కార్మికులు ముందుగానే తెలియజేసినప్పటికీ, అధికారులు ఒళ్ళు వేయాలని సూచించడంతో పనులు కొనసాగించగా సడన్గా రూఫ్ కూలింది. ఇంకా, వన్ సిమ్ ఎస్ఎస్కి అసలు పర్మిషన్ లేనట్టుగా తెలుస్తోంది. దీనిపై వెంటనే విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గాయపడిన కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాల్సిన అవసరం ఉందని టీబీజీకేస్ వైస్ ప్రెసిడెంట్ బడతల సమ్మయ్య, టీబీజీకేస్ సెంట్రల్ జాయింట్ సెక్రటరీ రత్నం అవినాష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ బాసనపెల్లి కుమారస్వామి, కేటీకే-6 సెక్రటరీ సురేష్ గోవర్ధన్ పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం దిక్సూచి





## ఉన్నతమైన కేరీర్ కి ఒక మార్గదర్శి
## ప్రాథమిక స్థాయి నుండి ఇంటర్ వరకు ప్రతీ పాఠశాల్లో
## ప్రతీ రోజూ 30 నిముషాలు దిక్సూచి పిరియడ్
## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ జిల్లా, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): విద్య అంటే కేవలం పాఠ్యాంశాల బోధన ఒక్కటే కాదని మారుతున్న కాలానికి అనుగుణంగా భవిష్యత్తులో విద్యార్థుల కెరీర్ కి అవసరమయ్యే వివిధ అంశాల్లో పాఠశాల స్థాయి నుండే అవగాహన కల్పిస్తేనే అది సమగ్రమైన విద్య అవుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు దిక్సూచి అనే కార్యాచరణ ను రూపొందించి విద్యార్థులకు అవసరమయ్యే వివిధ ప్రాధాన్యాత అంశాల్లో ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నరన్నారు. ప్రాథమిక స్థాయి నుండి ఇంటర్ వరకు విద్యార్థులకు, ప్రతీ రోజు ఒక్కో టాపిక్ పైన అర్ధ గంట సేపు ఈ దిక్సూచి పిరియడ్ లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగహన కల్పిస్తున్నరన్నారు. దిక్సూచిలో పొందుపరిచిన అంశాల వివరాలు కలెక్టర్ మాటల్లోనే విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగపడే నైపుణ్యాలను చిన్నప్పటి నుంచే పరిచయం చేస్తేనే అది నిజమైన విద్య అవుతుంది అందుకే "దిక్సూచి" కార్యక్రమాన్ని రూపొందించి దీని ద్వారా విద్యార్థుల కేరిర్ కి అవసరమైన అనేక రంగాలపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యా జ్ఞాన నైపుణ్యాలలో భాగంగా చదవడం, రాయడం, కమ్యూనికేషన్, అంకెల అవగాహన, తార్కిక ఆలోచన, మాట్లాడే ఇంగ్లీష్, సాధారణ జ్ఞానం, శాస్త్రీయ ఆలోచన, ప్రయోగాలు, సృజనాత్మక ఆవిష్కరణలు.

**వ్యక్తిగత అభివృద్ధి నైపుణ్యాలు (PDS)**

స్వీయ అవగాహన, క్రమశిక్షణ, బాధ్యత, భావోద్వేగ నియంత్రణ, సమయపాలన, లక్ష్య నిర్ధారణ, ప్రేరణ, సరైన నిర్ణయాలు తీసుకోవడం.

**పౌర & నైతిక నైపుణ్యాలు (CES)**

నిజాయితీ, నైతిక విలువలు, వైవిధ్యం గౌరవించడం, పర్యావరణ పరిరక్షణ, సమాజ సేవ, మానవహక్కుల అవగాహన, డిజిటల్ భద్రత.

**సామాజిక నైపుణ్యాలు (SIS)**

సరైన కమ్యూనికేషన్, శ్రద్ధగా వినడం, జట్టు కృషి, నాయకత్వం, ప్రజా ప్రసంగం, సహకారం.

**కెరీర్ & వృత్తి నైపుణ్యాలు (CPS)**

సమస్యల పరిష్కారం, ప్రాజెక్ట్ నిర్వహణ, వ్యాపార చైతన్యం, డబ్బు వినియోగం, పొదుపు.

**శారీరక ఆరోగ్య నైపుణ్యాలు (PWS)**

వ్యాయామం, క్రీడలు, ఆరోగ్య సంరక్షణ, సరైన ఆహారం, పరిశుభ్రత, యోగా, ధ్యానం, ప్రథమ చికిత్స.

**సృజనాత్మకత & ఆవిష్కరణలు (CIS)**

కళలు, సంగీతం, నాటకం, కథ చెప్పడం, సృజనాత్మక రచన, కొత్త ఆలోచనలు, మీడియా & కంటెంట్ సృష్టి.

**సాంకేతిక ఆధునిక నైపుణ్యాలు (TTS)**

కంప్యూటర్, కోడింగ్, డేటా విశ్లేషణ, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత మొదలగు అంశాల పైన ఉపాధ్యాయులు విద్యార్థులకు మెలుకువలు నేర్పిస్తున్నారన్నారు. దిక్సూచి కోసం ప్రత్యేకంగా ఆన్లైన్ వేదిక ను కూడా రూపొందించామని దాన్ని ఉపయోగించుకొని విద్యార్థులు 8 అంశాల పైన వివరనాత్మక పరిజ్ఞానాన్ని ( వీడియో, ఆడియో, పిడిఎఫ్ )పెంపొందించుకోవచ్చున్నారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం దిక్సూచి లాంటి ఒక మార్గదర్శకాన్ని రూపొందించి ప్రతిరోజు దానికోసం ప్రత్యేకంగా ఒక పిరియడ్ని కేటాయించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపడేలా కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# ఈనెల 15న ఎమ్మార్వో ఆఫీస్ ముట్టడి

## విజయవంతం చేయండంటూ పిలుపు
## శ్యాంబాబు మాదిగ ఎంఎస్పీ ఎంఆర్పీఎస్ జిల్లా ఇన్చార్జి
## చంద్రమౌళి మాదిగ ఎంఎస్పీ ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు



భూపాలపల్లి, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ విహెచ్ పేస్ ఎం ఎస్ పి అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం ఎంఆర్పిఎస్ భూపాలపల్లి టౌన్ అధ్యక్షులు దోర్నాల భరత్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఈ సమావేశ ముఖ్య అతిథులు మడిపల్లి శ్యాంబాబు మాదిగ అంబాల చంద్రమౌళి మాదిగలు హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు వృద్ధులకు వితంతువులకు 2000 నుండి 4000 వరకు వికలాంగులకు 4000 నుండి 6000 వరకు పెన్షన్లు పెంచి ఇస్తామని మాట ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచిన ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా దాటి వేసే ప్రయత్నం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నిలదీయడానికి ఈనెల 15వ తేదీన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అన్ని మండలాల ఎంఆర్వో కార్యాలయాల ముట్టడించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మాట్లాడుతూ

ఈ జిల్లాలో ఉన్నటువంటి అన్ని మండలాల ప్రతి గ్రామం నుండి వచ్చి ఈ ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాల్సిందిగా ఉన్నటువంటి అన్ని గ్రామాల నుండి వికలాంగులు వృద్ధులు విత్తంతులు బీడీ గీత నేత నూతన పెన్షన్ దరులందరూ పెద్ద ఎత్తున ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకులు బొల్లి బాబు మాదిగ నోముల శ్రీనివాస్ మాదిగ జిల్లా ఉపాధ్యక్షులు దోర్నాల రాజేంద్ర మాదిగ దూడపాక శ్రీనివాస్ మాదిగ టౌన్ ఇన్చార్జి అంతడుపుల సురేష్ మాదిగ మిరపటి అశోక్ మాదిగ రేణిగుంట్ల రవి మాదిగ మంద తిరుపతి మాదిగ ఎర్ర భద్రయ్య మాదిగ చంటి మాదిగ నూనెపాకుల కుమారు మాదిగ మంద కిరణ్ మాదిగ మంచినీళ్ల వైకుంఠం మాదిగ బోడికల శ్రీకాంత్ మాదిగ ఒంటెరి రాజేష్ మాదిగ కుమ్మరి అనిల్ మాదిగ బోడికల సమయ మాదిగ సునీల్ మాదిగ మంగళ రవి తదితరులు పాల్గొన్నారు.

# ఈ సీజన్‌లో నాలుగోసారి గేట్ల ఎత్తివేత

## పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు చేరిక
## ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు
## కృష్ణా నదిలోకి 2,09,210 క్యూసెక్కుల నీరు విడుదల
## 600 క్యూసెక్కుల పైచిలుకు విడుదల ఇదదే మొదటిసారి
## దిగువ ప్రాంతాల ప్రజలు, జాలర్లకు అధికారుల హెచ్చరిక



నల్గొండ, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను అధికారులు శనివారం 26 గేట్లు 5 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో 2,09,210 క్యూసెక్కుల నీరు కృష్ణా నదిలోకి చేరుతోంది. గత రెండు రోజుల క్రితం పూర్తిగా మూసివేసిన గేట్లను శుక్రవారం ఉదయం రెండు గేట్లు, సాయంత్రానికి ఎనిమిది గేట్ల ద్వారా నీరు విడిచారు. శనివారం మొత్తం 26 గేట్లు ఎత్తడం ద్వారా ఈ సీజన్‌లో నాలుగోసారి భారీ స్థాయిలో నీరు విడుదల చేశారు. అధికారులు తెలిపిన ప్రకారం జూలై-ఆగస్టు నెలల్లోనే 600 క్యూసెక్కుల పైచిలుకు నీరు విడవడం ఇదే మొదటిసారి. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 589.50 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు చేరడంతో సాగర్ నిండుకుండలా మారింది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 2,59,610 క్యూసెక్కులు చేరుతుండగా, మెయిన్ పవర్‌హౌస్, కుడి-ఎడమ కాలువలు, ఎస్ఎల్బీసీ, లోలెవెల్ కాలువల ద్వారా కూడా నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గేట్లు మొత్తం ఎత్తిన కారణంగా దిగువ ప్రాంతాల ప్రజలు, జాలర్లు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# నియోజకవర్గ సమగ్ర అభివృద్దే ధ్యేయం

## రాష్ట్ర మంత్రి కొండ సురేఖ
## రూ.3 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): వరంగల్ తూర్పు నియోజకవర్గం సమగ్ర అభివృద్దే ధ్యేయమని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయశాఖ శాఖామంత్రి కొండ సురేఖ అన్నారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని పలు డివిజన్లలో రూ.3 కోట్ల తో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ముందుగా వరంగల్ తూర్పులోని జిడబ్ల్యూఎంసీ పరిధిలోని 21వ డివిజన్ ఎల్ బి నగర్ లో 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డు, డ్రైన్స్ పనులకు,

కాశిబుగ్గలో రూ.150 లక్షలతో నిర్మించే అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి, రూ 50 లక్షలతో నిర్మించే సిసి రోడ్ పనులకు, 26వ డివిజన్ గిర్మాజీపేట లో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్లు, డ్రైన్స్ పనులకు మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, కార్పొరేటర్లు మహ్మద్ ఫురాన్, ఓని స్వర్ణలత భాస్కర్, బాల్నే సురేష్, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్, బల్దియా ఈఈ సంతోష్ బాబు, సంబంధిత శాఖల అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో బతుకమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి

## మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల రాకేష్



కొత్తపల్లి గోరి, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నూతనంగా ఏర్పడిన కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో బతుకమ్మ విగ్రహం ఏర్పాటు కోసం మా గ్రామంలో రసన్ కుంటా రోడ్డుమీద బతుకమ్మ ఆడుకుంటారు. ఈ నెల 29వ తేదీ రోజున పెద్ద బతుకమ్మ ఉన్నందున, ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో బతుకమ్మ విగ్రహ ఏర్పాటుకు స్థలం సేకరించి విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని స్థానిక ఎమ్మార్వో లక్ష్మి రాజయ్యను కోరారు. గతంలో కూడా ప్రభుత్వాలను గోరకొత్తపల్లి మండల కేంద్రంలో ప్రజలు రోడ్డు మీద బతుకమ్మ ఆడుకునే పరిస్థితి వచ్చిందని, రోడ్డుపై నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశం కావున మహిళలకు ఇబ్బందికరంగా ఉంటది అని తక్షణమే ఉన్నత అధికారులు చొరవచూపి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నాను.

# జస్టిస్ లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ కె. లక్ష్మణ్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి స్వాగతం పలికారు. హనుమకొండలోని ఉమ్మడి వరంగల్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ హైదరాబాద్ నుండి హనుమకొండ లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్దకు చేరుకోగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ తో జిల్లా కలెక్టర్ తో పాటు హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పట్టాభి రామారావు, జస్టిస్ నిర్మలా గీతాంబ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఫోర్త్ సిటీ నుంచి కొత్త ఎక్స్‌ప్రెస్ హైవే



రంగారెడ్డి, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): రవాణా ఆధారిత అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. రాష్ట్ర రాజధానితో వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని పెంచేలా నిర్ణయాలను తీసుకుంటున్నది. ఇందులో భాగంగా తెలంగాణ – ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉండేలా ఎక్స్ ప్రెస్ హైవే రైల్వే లైన్ వంటి సదుపాయాల కల్పనకు ఇరు రాష్ట్రాలు సమాలోచనలు చేస్తున్నాయి. ఏపీ పునర్విభజన చట్టంలో అపరిష్కృత అంశాలలో ఒకటైన అమరావతి– హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ హైవేకి కేంద్ర హోంశాఖ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవేను 12 వరుసలతో చేపట్టాలని ఇరు రాష్ట్రాలు కేంద్రానికి విజ్ఞప్తి చేశాయి. అయితే ఎక్స్ ప్రెస్ హైవే హైదరాబాద్ నుంచి కాకుండా ఫోర్త్ సిటీ నుంచి చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. ఇదే ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఏపీ స్పందనను బట్టి ఎక్స్ ప్రెస్ హైవే అలైన్‌మెంట్‌పై స్పష్టత రానున్నట్టు తెలుస్తోంది.

**హైవేకు సమాంతరంగా రైల్వేలైన్**

రాష్ట్రంలో తీరప్రాంతం లేకపోవడం సిమెంటు, బియ్యం, ఎరువులు, చమురు తదితర ఎగుమతులు, దిగుమతులకు కలుగుతున్న అవరోధాన్ని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైల్వే లైన్ ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. హైదరాబాద్ శివారులో ఏర్పాటు చేసే డ్రైపోర్టుకు మచిలీపట్నం నౌకాశ్రయానికి కనెక్టివిటీ ఉండేలా రైల్వేలైన్ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయంతో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ఫోర్త్ సిటీ మీదుగా వెళ్లేలా ఎక్స్ ప్రెస్ హైవేకు సమాంతరంగా ఈ రైల్వే లైన్ ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం కేంద్రం వద్ద ఉంచింది. కమాండ్ కంట్రోల్ సెంటర్ లో రైల్వే ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం నిర్వహించిన సమీక్షలోనూ ఇదే విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎక్స్ ప్రెస్ హైవే, రైలు మార్గంతో రవాణా ఆధారిత అభివృద్ధి జోరందుకుంటుందన్న అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. రియల్ రంగం, పారిశ్రామిక ప్రగతికి ఈ కొత్త ప్రాజెక్టు మరింత తోడ్పడుతుందని వారు పేర్కొంటున్నారు.

**రూ.10 వేల కోట్ల అంచనా**

ప్రస్తుతానికి హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి 65 కు సమాంతరంగా గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే ఏర్పాటు చేసే యోచన ఉంది. అయితే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవేను విజయవాడ రహదారి నుంచి కాకుండా ఫోర్త్ సిటీ నుంచి చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. ఫోర్త్ సిటీ సమీపంలోని తిప్పారెడ్డిపల్లి నుంచి రంగారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మీదుగా ఎక్స్‌ప్రెస్ హైవే కొనసాగి ఏపీలోని సత్తెనపల్లి మీదుగా అమరావతి క్యాపిటల్ సిటీ వరకు అనుసంధానం అయ్యేలా ప్రతిపాదించినట్టు తెలిసింది. చివరకు ఈ హైవే లంకెలపల్లి మీదుగా బందరు పోర్టు వరకు ఉండేలా సూచనలు చేసినట్టు సమాచారం. 12 వరుసల ఎక్స్ ప్రెస్ హైవేకు రూ.10 వేల కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఫోర్త్ సిటీ నుంచి అమరావతికి 211కి.మీ.లు కాగా బందర్ పోర్టుకు దాదాపు 297కి.మీ.లు ఉంటుంది. హైదరాబాద్– విజయవాడ మధ్య దూరంతో పోలిస్తే కొత్త ప్రతిపాదించిన రోడ్డు 57 కిలోమీటర్లు తక్కువగా ఉంటుంది. ఈ ఎక్స్ ప్రెస్ హైవేపై రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం కూడా రెండున్నర గంటలే. అలైన్‌మెంట్‌పై స్పష్టత వచ్చిన వెంటనే ఎక్స్ ప్రెస్ హైవే కోసం డీపీఆర్‌కు త్వరలోనే టెండర్లు పిలిచేందుకు జాతీయ రహదారులు, ఉపరితల రవాణా శాఖలు సన్నద్ధమవుతున్నాయి.

**ఫ్యూచర్ సిటీ నుంచి నలు దిశలా**

సీఎం రేవంత్ రెడ్డి కలల స్వప్నం ఫోర్త్ సిటీకి నలువైపుల నుంచి చేరుకునేలా రవాణా సదుపాయాలను చేపడుతున్నారు. ఇందులో భాగంగా 300 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రోడ్డును ప్రభుత్వం చేపడుతోంది. ఇందుకు భూసేకరణ జరుగుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని రావిర్యాల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగంలోని ఆమన్ గల్ వరకు మొత్తం 41.5 కి.మీ.ల మేర చేపడుతున్నారు. తొలి దశలో రావిర్యాల (టాటా ఇంటర్ చేంజ్)నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు చేపట్టే 19.20 కి.మీ.ల రోడ్డు నిర్మాణానికి రూ.1,665 కోట్లు, రెండో దశలో మీర్‌ఖాన్‌పేట నుంచి ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం పరిధిలోని అమనగల్లు వరకు 22.30 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2,365కోట్లను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. టెండర్లు కూడా ఖరారైన ఈ రోడ్డుకు రతన్ టాటా రోడ్డుగా ప్రభుత్వం నామకరణం చేసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి మీర్‌ఖాన్‌పేట్ వద్ద నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో కారిడార్ డీపీఆర్ తయారీ కోసం సర్వే పనులు చకచకా సాగుతున్నాయి. శంషాబాద్ నుంచి చెన్నై వరకు బులెట్ ట్రైన్ కోసం సీఎం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండడంతో ఫ్యూచర్ సిటీకి ఇది మరింత ప్రయోజనం చేకూర్చనున్నది.

# అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం




హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): హైడ్రా అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తోంది. చెరువులు, నాళాలు, ప్రభుత్వ స్థలాలు, బఫర్ జోన్ లోని స్థలాలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కబ్జాదారుల నుంచి వందల కోట్ల విలువైన భూములను రక్షిస్తుంది హైడ్రా. ఈ క్రమంలో శంషాబాద్ లో 12 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన నిర్మాణాలతో పాటు ప్రహరీ గోడను తొలగించింది. 12 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేసి, ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వ భూమి విలువ రూ. 500 కోట్లు ఉంటుందని తెల్చింది. 2011 లో ఈ 12 ఎకరాల భూమిని ఇంటర్మీడియట్ బోర్డుకు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం కాగా, ఈ భూమి తనదే అంటూ అనీష్ కన్స్ట్రక్షన్ బోర్డు ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపట్టింది. స్థానికుల సమాచారంతో హైడ్రా కు ఫిర్యాదు చేసిన ఇంటర్మీడియట్ బోర్డు రెవిన్యూ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రా ప్రభుత్వ భూమిగా నిర్ధారించి, కబ్జా నుండి కాపాడింది.

# నీటివాటలో ఒక్క చుక్క నీరును వదులుకోం

**న్యాయమైన వాటా కోసం బలమైన వాదనలు వినిపిస్తాం**

**కృష్ణా జలాల వివాదంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**ట్రిబ్యునల్ విచారణలో పాల్గొననున్న సీఎం, మంత్రి ఉత్తమ్**



హైదరాబాద్, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన నీటివాటలో ఒక్క చుక్క నీరు కుడా వదులుకునే ప్రసక్తేలేదని ఆయన తేల్చిచెప్పారు. సెప్టెంబర్ 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు దేశరాజధాని ఢిల్లీలో జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తాను స్వయంగా పాల్గొనబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో 23 నుండి 25 వరకు జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్–2 విచారణలో తెలంగాణ ప్రభుత్వం అనుసరించాల్సిన అంశంపై శనివారం ఆయన కార్యాలయంలో న్యాయనిపుణులు, నీటిపారుదల రంగ నిపుణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇదే అంశంపై ఒత్తిడి తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకుని ఢిల్లీకి చేరుకుని సమీక్షిస్తారని ఆయన వెల్లడించారు. కృష్ణా జలాశయాలలో తెలంగాణ వాటాను సాధించేందుకు బలమైన వాదనలు వినిపించేందుకు పూర్తి స్థాయిలో అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని వారు ఇచ్చే నివేదికల ఆధారంగా న్యాయవాదులు రాష్ట్రానికి చెందాల్సిన నీటివాటపై వాదనలు వినిపించనున్నారని ఆయన పేర్కొన్నారు. %ఖఔణు% ఎదుట 2025 ఫిబ్రవరి నుండి వాదనలు కొనసాగుతున్నాయని, సమైక్యాంధ్రలో తెలంగాణా ప్రాంతానికి జరిగిన అన్యాయంపై ప్రస్తావించారని ఆయన తెలిపారు. శాస్త్రీయంగా నీటి కేటాయింపులు, ఆంధ్రప్రదేశ్ చేపట్టిన అనధికార బేసిన్‌ల వివరాలు, తెలంగాణా ప్రాంతంలో సాగునీటి అవసరాలు అందులో పొందు పరచరన్నారు. ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాలువల సామర్థ్యాలను పెంచుకుంటూ గోదావరి, పట్టిసీమ, చింతలపూడి, పులిచింతల నీరు అక్రమంగా తరలించుకుపోతున్న అంశాలను ఇప్పటికే ట్రిబ్యునల్ ముందు ఉంచామన్నారు. 1956 జలవివాద చట్టం,2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాల ఉల్లంఘనలకు పాల్పడిన విషయంపై వాదనలు వినిపించామన్నారు. 811 టీఎంసీల కృష్ణా జలాశయాలలో తెలంగాణా ప్రాంతానికి 71 శాతం కేటాయింపులు ఉండాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇక్కడ నిర్మిస్తున్న ప్రాజెక్టులకు 65% కేటాయింపులు ఉండాల్సిందేనన్నారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లుగా నీటి కేటాయింపులు ఉండాలని అందుకు అనుగుణంగా తాజా సమాచారాన్ని ట్రిబ్యునల్‌కు సమర్పించామని ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని జారవిడుచుకోబోమని ఆయన పునరుద్ఘాటించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా వినియోగిస్తున్న 291 టీఎంసీల నీటి ఉదంతం వెలుగులోకి వచ్చినందున ఆ నీటిని పునర్విభజన చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్, నదుల నిర్వహణ బోర్డుల ఎదుట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణలో కడుతున్న ప్రాజెక్టులపై అడ్డుపడుతుండడంతో ఒకింత ఆలస్యం జరుగుతోందని ప్రాజెక్టల నిర్మాణాలపై తెలంగాణాకు ఉన్న హక్కులను కుడా ట్రిబ్యునల్ ఎదుట జరిగే వాదనలలో వినిపిస్తామన్నారు. తమ వాదనలకు బలం చేకూరేలా ప్రతిపాదిత ప్రాజెక్టుల నిర్మాణాల అంశాలతో కూడిన ప్రత్యేక జీ.ఓ ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసేందుకు సన్నదమౌతుందన్నారు. వీటిలో కల్వకుర్తి, నెట్టెంపాడు,పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరం తాగునీటి అవసరాల కోసం కొత్తగా నిర్మిస్తున్న రిజర్వాయర్‌లు,100 టీఎంసీలను మళ్లించడానికి వీలుగా రూపకల్పన చేసిన జూరాల ఫ్లడ్ ఫ్లో కెనాల్‌లు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు తెలంగాణా ప్రాంతంలో ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించుకో లేకపోయిందని ఆయన బీఆర్‌ఎస్ పాలకులపై మండిపడ్డారు. గత పాలకుల ఉదాసీనతతోటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలించుకునిపోయి ప్రయోజనం పొందిందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుండే న్యాయంగా తెలంగాణాకు రావాల్సిన నీటి వాటాపై గట్టిపట్టు పడుతున్నామన్నారు. అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి ముందుకు పోతున్నామన్నారు. తెలంగాణాకు జరిగిన అన్యాయాన్ని ట్రిబ్యునల్ ఇప్పటికే గుర్తించిందని తెలంగాణాకు దక్కాల్సిన నీటి వాటా కేటాయింపులను ఎట్టి పరిస్థితుల్లో సాధించి తీరుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

మొదటి పేజీ తరువాయి



మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు యువతను నిలువునా మోసం చేశాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక ప్రైవేటు కళాశాలలు మూతపడే దుస్థితి వచ్చాయని బండి సంజయ్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు తమ సర్టిఫికెట్లను కళాశాలల నుంచి తీసుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. ఇక యాజమాన్యాలు, సిబ్బంది జీతాలు లేక అవస్థలు పడుతున్నారని తాము నమ్ముకున్న సంస్థలు కళ్లెదుటే కూలిపోతున్నాయని అన్నారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ పాలనా వైఫల్యమేనని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కనీసం గ్రూప్–1 పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయారని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలను కోల్పోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటు కళాశాలల సమస్యలు పరిష్కరించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు క్లియర్ చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# మహిళలకు దసరా కానుకగా ఇందిరమ్మ చీరలు

**ఇందిరమ్మ చీరలపై ప్రభుత్వం ప్రణాళికలు**

**రూ.480 కోట్ల అంచనాతో చేనేత కార్మికులకు ఆర్డర్**

**రెండు విడతలుగా మహిళలకు చీరల పంపిణీ**

**దసరా, సంక్రాంతికి పంపిణీ చేయాలని సర్కార్ యోచన**

**సెప్టెంబర్ 23 నుంచి పంపిణీ ప్రారంభించనున్న ప్రభుత్వం**








తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 13 (తీన్మార్ న్యూస్): విజయదశమి పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని మహిళలకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయనుంది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అన్ని జిల్లాల్లో ప్రారంభించనున్నారు.

**రెండు చీరల ప్రణాళిక**

మొదట ఒక్కొక్కరికి రెండు చీరలు ఇవ్వాలని ప్రభుత్వం యోచించినప్పటికీ, ప్రస్తుతానికి దసరా పండుగకు ఒకటి, జనవరిలో సంక్రాంతికి మరొకటి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ చీరల తయారీకి ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.480 కోట్ల అంచనా వ్యయంతో సిరిసిల్ల చేనేత కార్మికులకు ఆర్డర్ ఇచ్చింది. ఇప్పటివరకు 50 లక్షల చీరల తయారీ పూర్తవగా, మరో 10 లక్షల చీరల ఉత్పత్తి ఇంకా పెండింగ్‌లో ఉంది. ఒక్కో చీర తయారీకి సుమారు రూ.800 ఖర్చు అయినట్లు అధికారులు తెలిపారు.

**పంపిణీ విధానం**

రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు సెర్ప్ (SERP), మెప్మా (MEPMA) సంస్థల ఆధ్వర్యంలో ఈ చీరలను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఈ సంస్థలు జిల్లా వారీగా లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశాయి.

**చీరల ప్రత్యేకతలు**

మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చే ఈ చీరలు లేత నీలిరంగులో ఉండి, ముదురు నీలి అంచుతో రూపొందించబడ్డాయి. ఈ చీరలపై తెలుపు రంగు పువ్వులను ముద్రించారు. బ్లౌజ్‌తో కలిపి ఈ చీరల పొడవు 6.3 మీటర్లు ఉంటుంది. సీనియర్ సిటిజన్ మహిళలకు మాత్రం బ్లౌజ్ పీస్‌తో కలిపి 9 మీటర్ల చీరను పంపిణీ చేయనున్నారు.



# డ్రాగన్ ఫ్రూట్‌ను ఈ సీజన్‌లో తప్పకుండా తినాల్సిందే..



ఆరోగ్యంగా ఉండాలని చెప్పి చాలా మంది తమ రోజువారి ఆహారంలో భాగంగా పండ్లను తింటుంటారు. పండ్లలో మనకు అనేక రకాలు లభిస్తుంటాయి. కొన్ని ఏడాది పొడవునా లభిస్తే, మరికొన్ని పండ్లు మనకు సీజన్లలోనే అందుబాటులో ఉంటాయి. అయితే వాటిల్లో డ్రాగన్ ఫ్రూట్ కూడా ఒకటి. ఈ పండ్లను ప్రస్తుతం మన దేశంలోనూ అనేక ప్రాంతాల్లో పండిస్తున్నారు. చూసేందుకు పింక్ రంగులో ఎంతో ఆకర్షణీయంగా ఈ పండ్లు మనకు కనిపిస్తాయి. లోపలి గుజ్జు తెలుపు రంగులో చిన్నపాటి మచ్చల్లాంటి గింజలను కలిగి ఉంటుంది. ఈ పండు తియ్యగా ఉండదు. కానీ అద్భుతమైన పోషకాలను కలిగి ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల మనకు అసలు ఏవైనా లాభాలు కలుగుతాయా..? అని చాలా మంది సందేహిస్తుంటారు. అయితే ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

**రోగ నిరోధక శక్తికి..**

డ్రాగన్ ఫ్రూట్‌లో ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్, బీటాలెయిన్స్ అనబడే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. ముఖ్యంగా చర్మ కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల ముఖంపై ఉండే ముడతలు తగ్గుతాయి. వృద్ధాప్య ఛాయలు తొలగిపోతాయి. యవ్వనంగా కనిపిస్తారు. డ్రాగన్ ఫ్రూట్‌లో ఎరుపు రంగులో తొక్క ఉండే పండ్లు కూడా ఉంటాయి. వీటిల్లో బీటాలెయిన్స్ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. దీని వల్ల గుండె కండరాలు, రక్త నాళాల వాపులు తగ్గిపోతాయి. గుండె పోటు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. డ్రాగన్ ఫ్రూట్‌లో అధికంగా ఉండే విటమిన్ సి వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. తెల్ల రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం పొందవచ్చు. కనుక వర్షాకాలంలో డ్రాగన్ ఫ్రూట్‌ను కచ్చితంగా తినాల్సి ఉంటుంది.

**జీర్ణ వ్యవస్థకు..**

డ్రాగన్ ఫ్రూట్‌లో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఫైబర్ వల్ల పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో మలబద్దకం తగ్గుతుంది. డ్రాగన్ ఫ్రూట్ ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. జీర్ణ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. డ్రాగన్ ఫ్రూట్‌ను తింటే చెడు కొలెస్ట్రాల్ తగ్గిపోతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే ఫైబర్ కారణంగా ఈ పండ్లను తింటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. దీని వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది.

**బరువు తగ్గేందుకు..**

డ్రాగన్ ఫ్రూట్ అధిక బరువును తగ్గించడంలో సహాయం చేస్తుంది. ఇందులో క్యాలరీలు చాలా తక్కువగా, ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల ఈ పండ్లను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇలా డ్రాగన్ ఫ్రూట్‌ను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. కనుక ఈ పండ్లను తినడంలో ఎలాంటి సందేహాలకు గురి కావల్సిన పనిలేదు. ఈ పండ్లను నిరభ్యంతరంగా తినవచ్చు. డ్రాగన్ ఫ్రూట్‌ను రోజుకు ఒక కప్పు మోతాదులో తిన్నా చాలు, అనేక లాభాలు కలుగుతాయి.



## పల్లీలను నేరుగా తినడం కన్నా మొలకెత్తించి తింటేనే ఎంతో మంచిది

పల్లీలను మనం తరచూ తింటూనే ఉంటాం. వీటితో అనేక రకాల వంటకాలను తయారు చేస్తుంటారు. కొందరు పల్లీలతో చేసే తీపి వంటకాలను ఇష్టపడతారు. ఇంకొందరు వీటితో తయారు చేసే కారం వంటకాలను ఇష్టపడతారు. పల్లీలను మసాలా కూరల్లోనూ వేస్తుంటారు. వీటితో చట్నీలను తయారు చేస్తారు. అయితే పల్లీలను ఇలా తినడం కన్నా రోజూ నీటిలో నానబెట్టి వాటిని మొలకెత్తించి తినడం ఎంతో మంచిదని పోషకాహార నిపుణులు, వైద్యులు సూచిస్తున్నారు. పల్లీలను మొలకెత్తించి తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని అంటున్నారు. సాధారణ పల్లీల కన్నా మొలకెత్తిన పల్లీల్లో పోషకాల శాతం అధికంగా పెరుగుతుంది. అందువల్ల మొలకెత్తిన పల్లీలను తింటుంటే రెట్టింపు మొత్తంలో పోషకాలను పొందవచ్చు. పైగా అనేక ఆరోగ్యకర ప్రయోజనాలు కూడా కలుగుతాయి. పలు వ్యాధుల నుంచి బయట పడవచ్చు.

**పోషకాలు అధికం..**

సాధారణ పల్లీల్లో ఉండే పలు రకాల ఎంజైమ్‌లు పల్లీలు మొలకెత్తగానే పోషకాలుగా మారుతాయి. కనుక మొలకెత్తిన పల్లీలను తింటే మేలు జరుగుతుంది. మొలకెత్తిన పల్లీల్లో ఉండే పోషకాలను శరీరం కూడా సులభంగా శోషించుకుంటుంది. దీంతో శరీరానికి పోషణ లభిస్తుంది. పోషకాహార లోపం తగ్గుతుంది. మొలకెత్తిన పల్లీల్లో పలు రకాల బి విటమిన్లు, విటమిన్ ఇ అధిక మొత్తంలో ఉంటాయి. పల్లీలను మొలకెత్తించడం వల్ల వాటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల శాతం పెరుగుతుంది. పల్లీల్లో రెస్వెరెట్రాల్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. పల్లీలను మొలకెత్తిస్తే దీని శాతం పెరుగుతుంది. ఇది వయస్సు మీద పడకుండా చేస్తుంది. వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తుంది. దీంతో ముఖంపై, చర్మంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. యవ్వనంగా కనిపిస్తారు. అలాగే రెస్వెరెట్రాల్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను సైతం కలిగి ఉంటుంది. ఇది కీళ్ల నొప్పులు, వాపులను తగ్గిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..**

మొలకెత్తిన పల్లీల్లో ఫైటిక్ యాసిడ్ అధిక మొత్తంలో ఉంటుంది. దీని వల్ల మనం తినే ఆహారాల్లో ఉండే మినరల్స్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. ఐరన్, జింక్, మెగ్నిషియం వంటి పోషకాలు మనకు అధికంగా లభిస్తాయి. మొలకెత్తిన పల్లీల్లో ఫైబర్ అధిక మొత్తంలో ఉండడం వల్ల ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. మబద్దకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఈ పల్లీల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతగానో సహాయం చేస్తాయి. ఈ పల్లీలను తింటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. గుండె జబ్బులు రాకుండా అడ్డుకోవచ్చు.

**నాన్ వెజ్ తినని వారికి..**

మొలకెత్తిన పల్లీల్లో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధిక మొత్తంలో ఉంటాయి. నాన్ వెజ్ తినని వారికి ఇవి అత్యుత్తమ ప్రోటీన్లను అందిస్తాయి. ప్రోటీన్ల వల్ల కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. కణజాలం మరమ్మత్తులకు గురవుతుంది. శరీరానికి శక్తి లభిస్తుంది. ఈ ప్రోటీన్లు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. దీంతో అతి ఆకలి తగ్గుతుంది. ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. సాయంత్రం సమయంలో చిరుతిళ్లను తినే బదులు మొలకెత్తిన పల్లీలను తింటే రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం పొందవచ్చు. మొలకెత్తిన పల్లీలను తింటే వాటిల్లో ఉండే ఫైబర్ కారణంగా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఇలా మొలకెత్తిన పల్లీలను తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

## బీపీ తక్కువగా.. బ్లడ్ షుగర్ ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించండి

డయాబెటిస్ అనగానే మనలో చాలా మందికి రక్తంలో అధిక చక్కెర స్థాయిలు గుర్తొస్తాయి. కానీ ఇలాంటి వాళ్లల్లో ఒక్కోసారి బీపీ తక్కువయ్యే ప్రమాదం కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ రెండింటి కాంబో ప్రమాదాల ముప్పును పెంచుతుందని హెచ్చరిస్తున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడానికి, బీపీ తగ్గడానికి వెనక కొన్ని కీలక మార్పులు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.

**షుగర్ లెవెల్స్ పెరిగినప్పుడు..**

సాధారణంగా రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు శరీరం.. ఈ అదనపు చక్కెరను వదుల్చుకునేందుకు ప్రయత్నిస్తుంది. దీంతో మూత్ర విసర్జన ఎక్కువవుతుంది. ఈ క్రమంలో శరీరం నుంచి అధికంగా నీరు బయటకుపోతుంది. ఈ క్రమంలో రక్తంలో కూడా నీరు తగ్గి బీపీ తగ్గుతుంది. చివరకు రోగులు డీహైడ్రేషన్ బారిన పడతారని వైద్యులు చెబుతున్నారు. శరీరానికి, మెదడుకు ఆక్సిజన్, ఇతర పోషకాలు అందక రోగులు నిరసనపడతారు. కొందరిలో తలతిరుగుతున్నట్టు అనిపించడం, నీరసం, చూపు మసకబారినట్టు ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి సందర్భాల్లో



కొందరు మూర్ఛపోతారు కూడా డయాబెటిస్ రోగుల్లో కొందరికి అటానమిక్ న్యూరోపతి అనే మరో సమస్య కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య ఉన్న వాళ్లల్లో నాడులు దెబ్బతిని బీపీపై నియంత్రణ తగ్గుతుంది. ఇలాంటి సందర్భాల్లో అకస్మాత్తుగా లేచినా, కూర్చొన్నా బీపీలో మార్పులు వచ్చి తలతిరగటం, మూర్ఛపోవడం వంటి సమస్యలు ఉంటాయి. వృద్ధుల్లో ఇలాంటి సమస్యలు ఉంటే వారు కింద పడి ఎముకలు విరిగే ప్రమాదం కూడా ఎక్కువవుతుంది.

ఇది గుండె, ఇతర అవయవాలపై కూడా ప్రభావం చూపిస్తుంది. కాబట్టి, డయాబెటిక్ రోగులు బీపీ నియంత్రణ కోసం తగినంత నీరు తాగాలి. నిత్యం, బీపీ, చక్కెర స్థాయిలపై ఓ కన్నేసి ఉంచాలి. సడెన్‌గా లేవడం, కూర్చోవడం వంటివి చేయకూడదు. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగి, బీపీ పడిపోయి తలతిరుగుతున్నట్టు, మూర్ఛపోతున్నట్టు అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు.

## బీ కేర్ ఫుల్.. ఈ అలవాట్లు జీర్ణవ్యవస్థను నాశనం చేస్తాయి

జీర్ణవ్యవస్థ అనేది ఆహారాన్ని శరీరం ఉపయోగించుకోగల పోషకాలుగా విడగొట్టే అవయవాల సమూహం. ఇది నోరు, ఆహార వాహిక, జీర్ణాశయం, చిన్నపేగు, పెద్దపేగు వంటి భాగాలను కలిగి ఉంటుంది, ఇవి ఆహారాన్ని జీర్ణం చేసి, పోషకాలను గ్రహించి, వ్యర్థాలను విసర్జించడానికి సహాయపడతాయి. కానీ, జీర్ణవ్యవస్థ చెడిపోవడం వల్ల మనం చాలా సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. అయితే, మన అలవాట్లలో ఏది జీర్ణవ్యవస్థ చెడిపోవడానికి కారణమవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..

**జంక్ ఫుడ్**

సక్రమంగా తినకపోవడం వల్ల జీర్ణవ్యవస్థ బలహీనపడి జీర్ణక్రియ లేదా గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. సమయానికి తినకపోవడం వల్ల కడుపులో భారం, అసౌకర్యం కలుగుతుంది. జంక్ ఫుడ్, వేయించిన ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. ఉబ్బరం లేదా మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. ఇది దీర్ఘకాలంలో తీవ్రమైన జీర్ణ సమస్యలను కలిగిస్తుంది.

**ఆహారం తినకపోడం**

రాత్రి పడుకునే ముందు ఆహారం తినడం వల్ల కడుపులో జీర్ణక్రియ సరిగ్గా జరగదు. ఆమ్లత్వం పెరుగుతుంది. ఇది నిద్రకు భంగం కలిగిస్తుంది. కడుపులో మంటను కలిగిస్తుంది.



**నూనె అధికంగా తీసుకోవడం**

నూనె, సుగంధ ద్రవ్యాలు అధికంగా తీసుకోవడం వల్ల గుండెల్లో మంట, గ్యాస్, అజీర్ణం పెరుగుతాయి. ఈ అలవాటును పదే పదే కొనసాగించడం వల్ల జీర్ణవ్యవస్థ బలహీనపడి కడుపు వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది.

**నీరు లేకపోవడం**

నీరు లేకపోవడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. రోజంతా తగినంత నీరు తాగకపోవడం వల్ల ఉబ్బరం, కడుపులో అసౌకర్యం కలుగుతుంది.

**ఒత్తిడి, ఆందోళన**

అధిక ఒత్తిడి, ఆందోళన జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతాయి. దీని కారణంగా కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం, గ్యాస్ వంటి సమస్యలు సర్వసాధారణం అవుతాయి.

**వ్యాయామం చేయకపోవడం**

కూర్చోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. ఇది బరువు పెరగడానికి దారితీయడమే కాకుండా మలబద్ధకం, కడుపులో భారం వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది.

**మొబైల్ లేదా టీవీ చూడటం**

మొబైల్ లేదా టీవీ చూస్తూ తినడం వల్ల ఏకాగ్రత లోపిస్తుంది. జీర్ణక్రియ సరిగ్గా జరగదు. దీనివల్ల గ్యాస్, అజీర్ణం, ఇతర కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి. సకాలంలో చికిత్స చేయకపోతే ఇవి తీవ్రంగా మారవచ్చు.



# నిశాంక మెరుపు హాఫ్ సెంచరీ..

## బంగ్లాను చిత్తుగా ఓడించిన శ్రీలంక..!

ఆసియా కప్‌లో మాజీ ఛాంపియన్ శ్రీలంక బోణీ కొట్టింది. గ్రూప్ బీ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత ప్రత్యర్థిని తక్కువకే కట్టడి చేసిన లంక.. 140 పరుగుల లక్ష్యాన్ని ఆడుతూపాడుతూ ఛేదించింది. ఓపెనర్ పథుమ్ నిశాంక(50) హాఫ్ సెంచరీతో చెలరేగి విజయానికి పునాది వేయగా.. మిడిలార్డర్‌లో కమిల్ మిషరా(46 నాటౌట్) రాణించడంతో లంక అలవోకగా బంగ్లాను చిత్తు చేసింది. దాంతో.. రెండో విక్టరీతో సూపర్ 4 సాధించాలనుకున్న లిటన్ దాస్ బృందానికి నిరాశే మిగిలింది.

ఆసియా కప్ పదిహేడో సీజన్‌ను శ్రీలంక ఘనంగా ఆరంభించింది. అబూదాబీలోని షేక్ జయేద్ స్టేడియంలో బంగ్లాదేశ్‌ను ఓడించి పాయింట్ల ఖాతా తెరిచింది లంక. బంగ్లా నిర్దేశించిన 140 పరుగుల ఛేదనను ఓపెనర్ పథుమ్ నిశాంక (50) ధాటిగా మొదలెట్టాడు. రెండో ఓవర్లోనే ఓపెనర్ కుశాల్ మెండిస్ (3) ఔటైనా కమిల్ మిషరా(46 నాటౌట్)తో కలిసి 95 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. వీళ్లిద్దరి విజృంభణతో పది ఓవర్లకే బంగ్లా ఓటమి ఖాయమైపోయింది. అర్ధ శతకం తర్వాత మెహిదీ హసన్ ఓవర్లో నిశాంక వెనుదిరిగాడు. కాసేపటికే కుశాల్ పెరీరా(9), దసున్ శనక(1) పెవిలియన్ చేరినా.. మిషరా అజేయంగా నిలిచి జట్టుకు 6 వికెట్ల విజయాన్ని అందించాడు. దాంతో.. 14.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది లంక.

**మెరిసిన షమీమ్, జకీర్**

హాంకాంగ్‌పై దంచికొట్టిన బంగ్లాదేశ్ ఆటగాళ్లు శ్రీలంకపై జోరు చూపించలేకపోయారు. చమీర విజృంభణతో ఓపెనర్లు డకౌట్ అవ్వడంతో ఆదిలోనే బంగ్లా కష్టాల్లో పడింది. సున్నాకే రెండు వికెట్లు కోల్పోయిన జట్టును కెప్టెన్ లిటన్ దాస్(28), తౌహిద్ హ్రిదోయ్(9)లు ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, హసరంగ ఓవర్లో లిటన్ దొరికిపోగా.. కమిల్ మిషరా మెరుపు త్రోకు తౌహిద్ రనౌట్‌గా వెనుదిరిగాడు. 38 పరుగులకే నాలుగు వికెట్లు పడిన దశలో షమీమ్ హొసేన్(42 నాటౌట్), జకీర్ అలీ(41 నాటౌట్)లు క్రీజులో పాతుకపోయి ఏడో వికెట్‌కు 81 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. చివరి రెండు ఓవర్లలో 26 రన్స్ పిండుకుంది ఈ జోడీ. హొసేన్, జకీర్‌లు ఆరో వికెట్‌కు అజేయంగా 81 పరుగులు రాబట్టడంతో.. బంగ్లా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేయగలిగింది.

# నేడు ఇండియా, పాకిస్తాన్ మధ్య హై-వోల్టేజ్ మ్యాచ్

## 2025 ఆసియా కప్‌లో జరగనున్న కీలక పోరు

## ఉత్కంఠగా ఎదురుచూస్తున్న క్రికెట్ అభిమానులు



2025 ఆసియా కప్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగే మ్యాచ్ కోసం యావత్ ప్రపంచం ఎదురుచూస్తోంది. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ సెప్టెంబర్ 14న దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఈ రెండు దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్ అంటే కేవలం ఆట మాత్రమే కాదు, ఇది భావోద్వేగాలు, ప్రతిష్టకు సంబంధించిన యుద్ధం. ప్రపంచం మొత్తం ఈ గొప్ప మ్యాచ్‌పై దృష్టి పెట్టింది. అయితే, దుబాయ్ వాతావరణం ఈ మ్యాచ్‌కు అనుకూలంగా ఉంటుందా అనే చర్చ ఇప్పుడు జరుగుతోంది. దుబాయ్ ఎడారి ప్రాంతం కాబట్టి, సహజమైన తుఫానులు వచ్చే అవకాశం లేదు. అయితే, సెప్టెంబర్ 14న భారత్-పాకిస్తాన్ మధ్య జరగనున్న మ్యాచ్ మాత్రం ఎడారి తుఫాను లాంటి ఉత్కంఠను రేపనుంది. ఈ మ్యాచ్ దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో జరగనుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, మ్యాచ్ రోజు దుబాయ్‌లో వాతావరణం వేడిగా, పూర్తిగా స్పష్టంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. మ్యాచ్ రోజు దుబాయ్‌లో ఉష్ణోగ్రత సుమారు 38 నుండి 40 డిగ్రీల సెల్సియస్ ఉండవచ్చని అంచనా. ఇది ఆటగాళ్లకు ఒక పెద్ద సవాలును విసరవచ్చు. పగటిపూట చాలా వేడిగా ఉంటుంది.. అయితే సాయంత్రం అయ్యేసరికి ఉష్ణోగ్రత తగ్గుతుంది. సాయంత్రం ఉష్ణోగ్రత 32 డిగ్రీల సెల్సియస్ వరకు పెరగవచ్చు, ఇది ఆటగాళ్లకు కొద్దిగా ఉపశమనం కలిగిస్తుంది. అయితే, టెంపరేచర్ చాలా ఎక్కువగా ఉండటం వల్ల ఆటగాళ్లు తీవ్రమైన అలసట, చెమటతో ఇబ్బంది పడవచ్చు. ఈ పరిస్థితుల్లో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం. మ్యాచ్ సమయంలో వర్షం పడే అవకాశం దాదాపుగా లేదు. వర్షం పడే అవకాశం కేవలం 4% మాత్రమే ఉంది. ఆకాశం పూర్తిగా స్పష్టంగా ఉంటుంది. మ్యాచ్ ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తవుతుందని ఆశిస్తున్నారు. రెండు జట్ల మధ్య ఉత్కంఠభరితమైన మ్యాచ్‌ను చూడాలనుకునే అభిమానులకు ఇది పెద్ద ఊరట. మొత్తం మీద దుబాయ్‌లో వాతావరణం ఈ గొప్ప క్రికెట్ మ్యాచ్‌కు అనుకూలంగా ఉంటుంది. దీనివల్ల అభిమానులు ఒక అద్భుతమైన ఆటను చూడగలరు. భారత కాలమానం ప్రకారం.. భారత్-పాకిస్తాన్ మధ్య మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌ను భారతదేశంలో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో టీవీలో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. అలాగే, సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ స్ట్రీమింగ్‌ను చూడవచ్చు.




# ఇంగ్లాండ్ ప్రపంచ రికార్డ్ విజయం

## టీ20ఐలో అత్యధిక స్కోరు.. జింబాబ్వే 290 పరుగుల భారీ తేడాతో విజయం



సౌతాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్?లో ఇంగ్లాండ్ క్రికెట్ జట్టు ప్రపంచ రికార్డ్ సృష్టించింది. సిరీస్?లో భాగంగా రీసెంట్?గా జరిగిన రెండో టీ20లో సౌతాఫ్రికాను ఇంగ్లాండ్ చిత్తుగా ఓడించింది. ఇంగ్లాండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ 141 భారీ ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో ఆ జట్టు తొలుత 300ం స్కోర్ సాధించింది. అనంతరం అద్భుత బౌలింగ్?తో ప్రత్యర్థిని 158 పరుగులకే కట్టడి చేసిన ఇంగ్లీష్ జట్టు 146 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. దీంతో పలు ప్రపంచ రికార్డులు నమోదు అయ్యాయి. మాంచెస్టర్ వేదికగా శుక్రవారం రెండో టీ20 జరిగింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్- జాస్ బట్లర్ ఈ మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. వీళ్ల దెబ్బకు సౌతాఫ్రికా బౌలింగ్ విభాగం కుదేలైంది. తొలి వికెట్‌కు కేవలం 7.1 ఓవర్లలోనే 126 పరుగులు జోడించారు. బట్లర్ 30 బంతుల్లోనే 83 పరుగులతో రఫ్ఫాడించాడు. అతడు 276.67 స్ట్రైక్ రేట్‌తో ఆడడం విశేషం. ఓపెనర్లిద్దరు ఓ రేంజ్?లో ప్రత్యర్థి బౌలర్లను ఉతికి ఆరేశారు. అయితే 7.1 ఓవర్ వద్ద ఫార్చ్యూన్ బౌలింగ్‌లో బట్లర్ ఔటయ్యాడు. ఆ తర్వాత సాల్ట్ చెలరేగిపోయాడు. 60 బంతుల్లోనే సాల్ట్ 141పరుగులులి భారీ శతకం సాధించి ఔరా అనిపించాడు. ఇందులో 15 ఫోర్లు, 8 సిక్స్‌లు ఉండడం విశేషం. ఈ ఇద్దరితోపాటు జాకబ్ బెతేల్ (26 పరుగులు), హ్యారీ బ్రూక్ (41లి పరుగులు) చేశారు. దీంతో ఇంగ్లాండ్ టీ20 చరిత్రలో తొలిసారి 300 పరుగుల మార్క్ అందుకుంది. ఈ క్రమంలోనే ఇంటర్నేషనల్ టీ20లో 300ం స్కోర్ నమోదు చేసిన మూడో జట్టుగా ఇంగ్లాండ్ నిలిచింది. ఇంతకుముందు జింబాబ్వే (344/4 పరుగులు vs గాంబియా), నేపాల్ (314/3 vs మంగోలియా) ఈ ఫీట్ అందుకున్నాయి. అయియి ఐసీసీ ఫుల్ మెంబర్ టీమ్ (అంటే టెస్టు ఆడే దేశాలు)పై బాదిన అరుదైన ఇంగ్లాండ్ సాధించింది. కాగా, అంతర్జాతీయ టీ20ల్లో ఫుల్ మెంబర్ టీమ్‌పై అత్యధిక స్కోర్ చేసిన భారత్ రికార్డును ఇంగ్లాండ్ తాజా మ్యాచ్?తో బ్రేక్ చేసింది. ఇదివరకు ఈ లిస్ట్?లో భారత్ ఉండేది. గతేడాది బంగ్లాదేశ్‌పై టీమ్‌ఇండియా 297 పరుగులు చేసింది. ఇప్పుడు ఇంగ్లాండ్ 304 రన్స్‌తో భారత్ రికార్డ్ బద్దలుకొట్టింది. ఈ మ్యాచ్‌లో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది సాల్ట్ బ్యాటింగ్ గురించే. అతడు తొలి ఓవర్ నుంచే రెచ్చిపోయాడు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును జెట్ స్పీడ్?తో పరిగెత్తించాడు. అతడి దెబ్బకు కగిసో రబాడ (70 పరుగులు), విలియమ్స్ (62 పరుగులు), మార్కో జాన్సన్ (60 పరుగులు) లాంటి స్టార్ బౌలర్లకు సైతం భారీ స్థాయిలో పరుగులు ఇచ్చుకున్నారు. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ తరఫున వేగవంతమైన టీ20 సెంచరీ (39 బంతుల్లో) చేసిన రికార్డ్ కొట్టాడు. అలాగే ఆ జట్టు నుంచి టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన బ్యాటర్‌గానూ నిలిచాడు. కాగా, సాల్ట్ 2025 ఐపీఎల్‌లోనూ ఆర్సీబీ తరుపున అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. సౌతాఫ్రికాను ఇంగ్లాండ్ 16.1 ఓవర్లలోనే 158 రన్స్?కు ఆలౌట్ చేసింది. ఈ నేపథ్యంలో ఇంగ్లీష్ జట్టు 146 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. టీ20 చరిత్రలోనే ఇంత భారీ తేడాతో నెగ్గిన జట్టుగా ఇంగ్లాండ్ వరల్డ్ రికార్డ్ కొట్టింది. జాంబియా బౌలర్లు చాలా నిస్సహాయంగా కనిపించారు. వీరంతా జింబాబ్వే బ్యాటర్స్ ముందు వికెట్ల కోసం వేడుకుంటూ కనిపించారు. జింబాబ్వే తరపున, కెప్టెన్ సికందర్ రజా కేవలం 43 బంతుల్లో 133 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సికందర్ రజా 309.30 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 15 సిక్సర్లు బాదాడు. దీంతో పాటు, తదివానాషే మరుమాని 19 బంతుల్లో 62 పరుగులు చేశాడు. తదివానాషే మరుమాని 326.31 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి తన ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. అదే సమయంలో, క్లైవ్ మదండే 17 బంతుల్లో 53 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. క్లైవ్ మదండే 311.76 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి 3 ఫోర్లు, 5 సిక్సర్లు బాదాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రపంచ రికార్డు లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జాంబియా జట్టు 14.4 ఓవర్లలో కేవలం 54 పరుగులకే కుప్పకూలింది. ఆ విధంగా, జింబాబ్వే 290 పరుగుల భారీ తేడాతో మ్యాచ్‌ను గెలుచుకుంది. జింబాబ్వే తరపున బ్రాండన్ మావుటా, రిచర్డ్ న్గారవా తలో 3 వికెట్లు పడగొట్టారు. వెస్లీ మాధేవెరే 2 వికెట్లు, ర్యాన్ బర్ల్ 1 వికెట్ తీశారు. జింబాబ్వే తరపున కేవలం 43 బంతుల్లో 133 పరుగులు చేసి అజేయంగా నిలిచిన సికందర్ రజా 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.



# ఫైనల్ చేరిన జైస్మిన్, నుపుర్

వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో జైస్మీన్ లాంబోరియా, నుపుర్ షెరాన్ దుమ్మురేపారు. అద్వితీయమైన ప్రదర్శనతో ఫైనల్ దూసుకెళ్లి బంగారు పతకానికి అడుగు దూరంలో నిలిచారు. శుక్రవారం జరిగిన మహిళల 57 కేజీల సెమీఫైనల్లో జైస్మీన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా(వెనిజువెలా)ను ఓడించింది. ఫైనల్లో ఆమె పారిస్ ఒలింపిక్స్ సిల్వర్ మెడలిస్ట్ జులియా(పోలెండ్)తో తలపడనుంది. 80 కేజీల విభాగంలో జరిగిన సెమీఫైనల్లో నుపుర్ షెరాన్ 5-0తో డుజ్జస్ సెమ(తుర్కియే)ను చిత్తు చేసింది. మ్యాచ్ ఆరంభం నుంచి వ్యూహాత్మకంగా ఆడిన నుపుర్ ప్రత్యర్థిపై క్రమం తప్పకుండా పంచ్‌లు విసిరి.. ఆధిపత్యం చెలాయించింది. మరోవైపు మీనాక్షి హుడా స్ఫూర్తిదాయక ప్రదర్శనతో సెమీఫైనల్ చేరి పతకాన్ని ఖాయం చేసింది. 48 కేజీల క్వార్టర్ ఫైనల్లో అండర్ 19 ప్రపంచ ఛాంపియన్ అలిస్ పామ్‌ఫెరి(ఇంగ్లండ్)ను మీనాక్షి చిత్తు చేసింది. ఈ బౌట్లో తన ఎత్తును అడ్వాంటేజ్‌గా మార్చుకుంది. బ్యాక్‌ఫుట్‌పై ఉంటూ ప్రత్యర్థిపై దాడి చేసింది. బలమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థి పంచ్‌లను కాచుకుని విజయాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో స్థానం కోసం అల్టాంట్(మంగోలియా)తో భారత బాక్సర్ అమీతుమీ తేల్చుకోనుంది. మరోవైపు పురుషుల్లో జాదుమణి సింగ్ పోరాటం క్వార్టర్స్‌లోని ముగిసింది. 50 కేజీల క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఛాంపియన్ సాన్ జార్(కజకిస్తాన్) చేతిలో జాదుమణి ఓటమిపాలయ్యాడు. దాంతో పురుషుల్లో భారత్ పోరాటం ముగిసింది. 2013 తర్వాత పురుషుల విభాగంలో భారత్ ఒక్క పతకం కూడా సాధించకపోవడం ఇదే తొలిసారి.

# మిరాయ్ తొలిరోజు 27 కోట్లు వసూలు

## చిత్ర విజయంతో...హీరో తేజ సజ్జా ఆనందం



యంగ్ హీరో తేజ సజ్జా , మంచు మనోజ్ కీలక పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిరాయ్'. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా వాటిని అందుకోవడంలో విజయం సాధించింది. తాజాగా నిర్మాణసంస్థ అధికారికంగా దీని వసూళ్లను వెల్లడించింది.తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.27.20 కోట్లు- వసూలుచేసినట్లు- తెలిపింది. దీనిపై హీరో తేజ సజ్జా స్పందిస్తూ.. 'మీ ప్రేమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇదే చరిత్ర, ఇదే భవిష్యత్తు, ఇదే మిరాయ్' అని ఆనందం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగానే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'మిరాయ్'కు మంచి స్పందన లభిస్తోంది. మొదటిరోజు విదేశాల్లో రూ.7లక్షల డాలర్లు వసూలుచేసినట్లు- నిర్మాణ సంస్థ పేర్కొంది. దీని వీఎఫ్ఎక్స్ వర్క్‌పై నెట్టింట ప్రశంసలు వస్తున్నాయి. ప్రముఖులు కూడా దీనిపై పోస్ట్ పెడుతున్నారు. దీనిపై నిర్మాత విశ్వప్రసాద్ ఆనందం వ్యక్తంచేశారు. ఎంతో అద్భుతంగా దీన్ని తీర్చిదిద్దారని.. ఫ్రేమ్ టూ ఫ్రేమ్ చెక్ చేసినా బ్లర్ లేకుండా స్పష్టంగా కనిపిస్తున్నాయని సోషల్ మీడియా వేదికగా వీఎఫ్ఎక్స్ టీమ్‌ను ప్రశంసించారు. 'హను-మాన్'తో భారీ విజయాన్ని అందుకున్న తేజ ఆ చిత్రం తర్వాత ఎన్ని ఆఫర్లు వచ్చినప్పటికీ 'మిరాయ్' కోసం వాటన్నిటినీ వదులుకున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో వచ్చిన ఈ ఫాంటసీ అడ్వెంచర్‌లో ఈ హీరో సూపర్ యోధాగా కనిపించి మెప్పిస్తున్నారు. మహావీర్ లామా పాత్రలో మంచు మనోజ్ కూడా ఆకట్టుకుంటున్నారు. ఒక మామూలు కుర్రాడు తన ధర్మాన్ని తెలుసుకొని, ఒక పెద్ద ఆపదని ఆపడానికి ఎంత దూరం వెళ్తాడు? తన తల్లి ఆశయం కోసం ఏం చేశాడు? ఇతిహాసాల్లో ఉన్న సమాధానం కోసం అతడు చేసే ప్రయాణం ఏంటి అనే కథాంశంతో మిరాయ్ రూపొందింది.



# చెమటలు పట్టిస్తున్న నభా నటేష్!

గ్లామర్ వలకబోయడమే ట్రెండ్ గా పెట్టుకున్న కొంతమంది హీరోయిన్స్ ఎప్పటికప్పుడు అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకునే పనిలో పడ్డారు. అందులో భాగంగానే చాలామంది హీరోలు గ్లామర్ ఫోటోలతో నెటిజన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. కొంతమంది వ్యక్తిగత విషయాలతో పాపులారిటీ సంపాదించుకుంటే.. మరి కొంతమంది సినిమాల ద్వారా క్రేజ్ పొందుతున్నారు. ఇంకొంతమంది ఇలా గ్లామర్ ఫోటోలతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తన అందాలతో అభిమానులను సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది ప్రముఖ బ్యూటీ నభా నటేష్.

సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్ గా ఉంటూ ప్రేక్షకులను ఆకట్టుకునే ఈమె.. తాజాగా చీరకట్టులో సరికొత్త అందాలతో అందరినీ మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా నభా నటేష్ ను ఈ ఫోజ్ లో చూసేసరికి కుర్రాళ్ళు సైతం తట్టుకోలేకపోతున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. నేవీ బ్లూ కలర్ చీర కట్టుకొని అందాలతో మెస్మరైజ్ చేసింది.

బ్లూ కలర్ చీర కట్టుకొని అందుకు తగ్గట్టుగా జువెలరీ ధరించిన ఈమె.. మెడను బోసిగానే ఉంచేసింది. జుట్టును వదిలేసి నీటిలో కదులుతూ ఫోటోలకు ఫోజులిచ్చింది. నభా నటేష్ తాజాగా తడి అందాలతో షేర్ చేసిన ఈ ఫోటోలలో ఆమె నడుము, ఎద అందాలు హైలెట్ గా నిలిచాయి. మొత్తానికి అయితే ఈమె షేర్ చేసిన ఈ తడి అందాల ఫోటోలు ప్రతి ఒక్కర్ని ఆకట్టుకుంటున్నాయని చెప్పవచ్చు.



# హోమ్‌బౌండ్ హీరో మంచి నటుడు

## హీరోయిన్ జాన్వీ కపూర్ కితాబు

జాన్వీకపూర్, ఇషాన్ ఖట్టర్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'హోమ్‌బౌండ్' విడుదలకు ముందే ఎన్నో ఘనతలు సొంతం చేసుకుందీ చిత్రం. తాజాగా దీని గురించి జాన్వీకపూర్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇషాన్ ఖట్టర్‌పై ప్రశంసలు కురిపించారు. ఇది గొప్ప కథ. అందుకే ఈ చిత్రం నా కెరీర్‌కు ఉపయోగ పడుతుందా.. లేదా అని ఆలోచించకుండానే అంగీకరించాను. 'హోమ్‌బౌండ్' చిత్రీకరిస్తున్నప్పుడు ప్రతి సన్నివేశంపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. దీన్ని కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించినప్పుడు వచ్చిన ఆదరణ చూశాక ఆశ్చర్యపోయాం. ఇది ప్రేక్షకులపై ఎంత ప్రభావం చూపిందో మాకు అర్థమైంది. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ సినిమా చేసినందుకు ప్రేక్షకులు నన్ను ట్రోల్ చేస్తారేమో అనే భావన నాకెప్పుడూ రాలేదని జాన్వీకపూర్ అన్నారు. ఇక కేన్స్‌లో ఈ చిత్రానికి లభించిన స్పందన గురించి జాన్వీ మాట్లాడుతూ చిత్రబృందంలోని ప్రతిఒక్కరూ అంతర్జాతీయ గుర్తింపునకు అర్హులని అన్నారు. ఇందులో ప్రధానపాత్రలో నటించిన ఇషాన్ దేశంలోని ప్రతిభావంతులైన నటులలో ఒకడు. కానీ, అతడికి భారతీయ సినిమాలో ఇప్పటి వరకూ సరైన గుర్తింపు రాలేదు. కేన్స్ వేదికపై ఇషాన్‌ను చూడడం, ప్రపంచం అతడి నటనను ప్రశంసించడం చూసి నేనెంతో ఆనందించా. కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని అర్థమైందని చెప్పారు. ఇద్దరు స్నేహితుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'హోమ్‌బౌండ్'. ప్రముఖ దర్శకుడు నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా కీలక పాత్రలు పోషించారు. కేన్స్‌లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ సినిమా ఇటీ-వల 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్'(ఐఎఫ్ఎఫ్ఎం)లో ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకుడిగా నీరజ్ ఘైవాన్ పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు.

# రెండోపెళ్లికి సిద్ధంగా ఉన్న నటి ఎస్తేర్



ఇప్పటి వరకు ఒకే పెళ్లితో జీవితం గడిపేయాల్సిన సమాజపు ఆలోచన మారిపోయింది. విడాకులు తీసుకున్న, జీవిత భాగస్వామి లేకపోయినా, కొత్త జీవితం కోసం మరోసారి పెళ్లి చేసుకోవడమే ఇప్పుడు సాధారణంగా మారింది. సామాన్యులే కాదు, సినీ ప్రపంచంలోనూ ఈ ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. సింగర్ సునీత నుంచి అక్కినేని నాగచైతన్య వరకు చాలామంది రెండో పెళ్లి చేసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. అలాంటిది తాజాగా ఈ జాబితాలో చేరబోతున్నారంటూ వార్తల్లో నిలుస్తున్నారు హీరోయిన్ ఎస్తేర్ నొరోన్హా. కర్ణాటకలోని ఉడిపి కి చెందిన ఎస్తేర్, ముంబైలో చదువుకున్నారు. బాలనటిగా కొంకణి సినిమాల్లో నటించి, ఆ తర్వాత 2012లో బారొమాస్ అనే హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా అడుగుపెట్టారు. తెలుగులో పూరి జగన్నాథ్ సోదరుడు సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన వేయి అబద్ధాలు సినిమాతో ఎంట్రీ- ఇచ్చి, భీమవరం బుల్లోడు, గరం, జయ జానకి నాయక, ఐరావతం, 69 సంస్కార్ కాలనీ, చెంగురే బంగారు రాజా, డెవిల్, -టెనెంట్, థలా వంటి సినిమాల్లో నటిస్తూ తనకంటూ గుర్తింపు సంపాదించుకుంది. సినిమాల విషయం పక్కన పెడితే.. వ్యక్తిగత జీవిత విషయంలో మాత్రం తరచూ వార్తల్లో నిలిచింది. కారణం సింగర్ నోయెల్.. అతని ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె, ఏడాదిలోనే మనస్పర్థలతో విడాకులు తీసుకున్నారు. అయితే ఈ మధ్యకాలంలో ఎస్తేర్ రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ గాసిప్స్ వినిపించాయి. తాజాగా వాటిని నిజం చేస్తూనే ఓ బిగ్ అనౌన్స్‌మెంట్ ఇచ్చేలా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. జీవితంలో మరో అందమైన సంవత్సరం.. అవకాశాలు, అద్భుతాలను ఇచ్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు. పుట్టినరోజు సందర్భంగా మీ ప్రేమ, ఆశీర్వాదాలకు ధన్యవాదాలు. త్వరలోనే మీతో ఓ స్పెషల్ అనౌన్స్‌మెంట్ పంచుకుంటాను. వేచి ఉండండి' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌తో ఎస్తేర్ నిజంగానే రెండో పెళ్లి చేసుకోబోతుందా అనే వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463